

ఆకేపాడులో అధునాతన వసతులతో కట్టిన ఆరోగ్య కేంద్ర భవనం

రోజుకు లక్ష బాటిళ్ల స్కానింగ్

- సురక్ష యాప్‌తో వినియోగదారుడు సంతృప్తి
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్


మద్యం దుకాణంలో బాటిల్‌ను స్కానింగ్ చేసి చూపిస్తున్న ఈఎస్ మధుసూదన్

మదనపల్లె టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిరోజూ మద్యం దుకాణాల్లో లక్ష మద్యం బాటిళ్లను స్కానింగ్ చేసి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం మదనపల్లె పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్లను ఈఎస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుడికి మద్యం బాటిళ్లను స్వయంగా స్కానింగ్ చేసిన ఈఎస్ అందులోని వివరాలు చూపించి విక్రయించారు. ఈఎస్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి జిల్లాలోని 122 మద్యం దుకాణాలు, 11 బార్లలో మద్యం బాటిళ్లను స్కానింగ్ చేసి విక్రయిస్తున్నారన్నారు. రోజుకు రూ.1.62 కోట్ల వరకు మద్యం వ్యాపారం జరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ కూడా కల్తీ మద్యం విక్రయాలు జరగడం లేదన్నారు. స్కానింగ్ వలన వినియోగదారుడు సంతృప్తిగా మద్యం తీసుకెళుతున్నారన్నారు. పర్మిట్ రూముల్లో కిచెన్‌లు, రెస్టారెంట్‌లు నిర్వహించరాదని, సమయ పాలన పాటించాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ, హెచ్‌సీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ అనుకూల దీపావళిపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుకూల దీపావళిపై పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఇష్టమైన వారికి ఇచ్చే కానుకలు పర్యావరణానికి అనుకూలంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ శాఖాధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆకే'పాడు' ఆసుపత్రి

- పేదలకు అందని ప్రభుత్వ వైద్యం
- రోజురోజుకు తగ్గిపోతున్న రోగుల సంఖ్య
- అధునాతన భవనం నిర్మించినా సిబ్బంది లేక అలంకారప్రాయం


ఆసుపత్రికి రోగులు రాక వెలవెలబోతున్న కుర్చీలు

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఆకేపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పనిచేసే ప్రధాన వైద్యుడు విధులను పూర్తిగా విస్మరించడంతో సిబ్బంది కూడా అదే బాటలో ఉండటంతో ఆరోగ్య కేంద్రం అలంకారప్రాయంగా మారింది. రాజంపేట పట్టణానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని పల్లె ప్రాంతాలున్న ఆకేపాడులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి కావాల్సిన పక్కా భవనాలు, రోగులకు కావాల్సిన సదుపాయాలు, డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటానికి క్వార్టర్స్ ఏర్పాటు చేశారు. కాలానుగుణంగా అవి శిథిలావస్థకు చేరడంతో ఆధునిక వసతులతో కూడిన మరో భవనాన్ని ఏర్పాటు చేసినా వైద్యం మాత్రం అందడం లేదు. వైద్యులతో పాటు సిబ్బంది ఎవరూ అక్కడ నివాసం ఉండటం లేదు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు పనిచేస్తున్నారు. రెండో వైద్యుడు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా ప్రధాన వైద్యుడు సక్రమంగా పనిచేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ డాక్టర్ తనకు ఇష్టమైన సిబ్బంది డ్యూటీలకు పోకున్నా వచ్చినట్లు హాజరు వేయడం, తనకు నచ్చని సిబ్బంది ఎంత కష్టపడి పనిచేసినా వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడంతో ఇక్కడ పేదలకు వైద్యం దూరమైందని అంటున్నారు. ఈ ఆసుపత్రికి నిత్యం సుమారు 50 నుంచి 100 మంది వ్యాధిగ్రస్తులు వస్తుండేవారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న ఈ ప్రధాన వైద్యుడి నిర్లక్ష్యం వల్ల రోజువారీ వైద్యం చేసుకునేవారి సంఖ్య తగ్గిపోయింది. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యం చేయాల్సిన ప్రధాన డాక్టర్ ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో తెలియక ఆసుపత్రి అథోగతిపాలైంది.

నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు



ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు ఆసుపత్రి పనితీరుపై పరిశీలిస్తున్నాం. ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం సిబ్బంది నిర్లక్ష్యంపై మాకెవరూ ఫిర్యాదు చేయలేదు.

- డాక్టర్ సానె శేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, రాజంపేట.

అందని వైద్యం

ఆకేపాడు ప్రధాన ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులతో పాటు ఒక ఫార్మసిస్టు, ఇద్దరు సూపర్‌వైజర్‌లు, ఒక నర్సు, మొత్తం 10 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అయితే నైట్ వాచ్‌మన్, స్వీపర్ లేరు. సిబ్బందే చందాలు వేసుకుని ఓ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో వాచ్‌మన్, స్వీపర్, శానిటరీ వర్కర్, స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉండగా.. దీనికి అనుబంధంగా ఇటీవల రాజంపేటలో ఏర్పాటు చేసిన కోలోకేటెడ్ పీహెచ్‌సీ కింద 9 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు పని చేస్తున్నాయి. రాజంపేట కోలోకేటెడ్ పీహెచ్‌సీ సిబ్బంది 104 వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహిస్తుంటారు. అయితే వీరిపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ కోలోకేటెడ్ పీహెచ్‌సీ కూడా సక్రమంగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన మందులు ఎప్పటికప్పుడు సరఫరా అవుతున్నప్పటికీ ఇక్కడ వైద్య సిబ్బంది స్థిర నివాసం లేక ప్రధాన డాక్టరుతో పాటు ఆయనకు అనుకూలంగా ఉండే సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడంతో ఈ ఆరోగ్య కేంద్రం అధ్వానంగా మారింది. సిబ్బందితో పాటు తన హాజరు విషయంలోనూ ప్రధాన డాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, విధులకు రాకున్నా వచ్చినట్టు యాప్‌లో నమోదు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన డాక్టరు నిర్లక్ష్యం వల్ల ఆరోగ్య కేంద్రంలో పేద వారికి వైద్యం అందకుండా అలంకారప్రాయంగా తయారైంది. కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించి ఇక్కడ వైద్య సేవలు సక్రమంగా అందేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సొంత గ్రామం ఆకేపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా ప్రయోజనం లేకుండాపోయింది. కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించినా.. లక్షలాది రూపాయలు జీతాల రూపేణా ఇస్తూ ప్రభుత్వ వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినా ప్రధాన డాక్టరుతో పాటు కొందరు సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడంతో పల్లె ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది.

బస్టాండు కిట..కిట...


బస్సు ఎక్కేందుకు ఆపసోపాలు పడుతున్న ప్రయాణికులు

రాయచోటి, మదనపల్లె, సదుం, రొంపిచెర్ల, సుండుపల్లె మార్గాల్లోని బస్సుల్లో ఎక్కేందుకు విద్యార్థులు, మహిళలు ఆపసోపాలు పడ్డారు. వారాంతాలు, పండుగల సందర్భాల్లో పీలేరు నుంచి గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులు పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.


పీలేరు బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పీలేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా లభించిన వరుస సెలవుల నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పీలేరు ఆర్టీసీ బస్టాండులో రద్దీ నెలకొంది. బెంగళూరు, తిరుపతి, చెన్నై, మదనపల్లె, చిత్తూరు ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లేందుకు పెద్దఎత్తున పీలేరుకు చేరుకున్నారు. పీలేరు నుంచి

బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్త

- దుకాణాల పరిశీలనలో సబ్ కలెక్టర్ కల్యాణి


మిషన్ కాంపౌండ్‌లో అధికారులు, వ్యాపారులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల పరిశీలించారు. స్థానిక మిషన్ కాంపౌండ్, కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానంలో శనివారం పరిశీలించి అధికారులు, దుకాణదారులను అప్రమత్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మదనపల్లె డివిజన్‌లో మొత్తం 86 దుకాణాలు ఏర్పాటు చేయగా, అందులో 12 దుకాణాలు కొత్తవి కాగా, పాతవాటిని రెన్యువల్ చేశామన్నారు. ఇందులో మిషన్ కాంపౌండ్‌లో 20 దుకాణాలు, టిప్పుసుల్తాన్ మైదానంలో 17 దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాపారులంతా నిబంధనలు పాటించాలని, ఎక్కడైనా అతిక్రమిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే ప్రజలు టపాసులు కొనాలని, ఎవరైనా అక్రమంగా వ్యాపారం చేసినా, టపాసులు తయారు చేసినా, తరలించినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి శివన్న, ట్రాన్స్‌కో ఏడీఈ సురేంద్రనాయక్, ఏఈ ప్రసాద్, ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ వెంకటసుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

'నాలా' రద్దు.. 'రియల్' జోరు

- జిల్లాలో ఊపందుకున్న స్థిరాస్తి వ్యాపారం
- అవినీతి అధికారుల ముక్కుకు కళ్లెం
- ఆనందంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు


మదనపల్లె వద్ద వేస్తున్న లేఅవుట్

మదనపల్లె టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కన్వర్షన్ చెల్లించాలి.. ఈ తతంగానికి రెవెన్యూ అధికారుల వద్దకు ఎన్నిసార్లు తిరగాలో.. తిరుగుతాం.. కానీ ఎంత మొత్తంలో డబ్బులు సమర్పించాలో.. ఈ మాటలు జిల్లాలోని ప్రతి రియల్టర్ (స్థిరాస్థి వ్యాపారి) నోట్లో పదే పదే వినిపిస్తుంటాయి. కన్వర్షన్ అంటేనే రెవెన్యూ అధికారులకు కాసుల పంట. వీఆర్‌వో నుంచి మండలాల్లో తహసీల్దార్, అక్కడి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు కొందరు ఉద్యోగుల చేతులు తడిపితేనే పనులు చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఉద్యోగుల చేతులకు కళ్లెం వేయడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో ఏర్పాటు చేసిన నాలా చట్టాన్ని రద్దు చేసింది. ఈ స్థానంలో బెటర్‌మెంట్ చార్జీలు పెట్టి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది.

నాలా చట్టం ఏమి చెబుతుంది

వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వాడుకునేందుకు భూమి యజమానులు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాల్సి ఉంటుంది. దీనిపై 2006 సంవత్సరంలో ప్రభుత్వం నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం భూమి విలువలో 4 శాతాన్ని కన్వర్షన్ ట్యాక్స్‌గా నిర్ణయించారు. ల్యాండ్ కన్వర్షన్‌ను ఆయా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్డీవో లేదా సబ్‌కలెక్టర్ స్వయంగా భూమిని పరిశీలించి కన్వర్షన్ చేస్తారు. ఇలా అనుమతి లేకుండా ల్యాండ్ కన్వర్షన్ చేయించకుండా వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే ఈ చట్టం ప్రకారం భారీగా జరిమానా విధిస్తారు. నాలా చట్టంలోని లొసుగులను అవకాశంగా తీసుకున్న కొంతమంది రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులను ముప్పుతిప్పలు పెట్టారు. భూమి విలువలో ప్రభుత్వానికి 4 శాతం పన్ను చెల్లించినా, కొందరు రెవెన్యూ అధికారులు తమకు 10 శాతం కమీషన్ ఇవ్వాలని పట్టుబట్టి వసూలు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం అవినీతిని అంతం చేయడానికి, ప్రభుత్వ ఆదాయం పక్కదారి మళ్లకుండా నాలా చట్టాన్ని రద్దు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది.


వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాలకు సిద్ధం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

నాలా చట్టం రద్దు తరువాత...

రాష్ట్రంలో నాలా చట్టం రద్దు తరువాత, వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాలకు వాడుకునేందుకు చెల్లించాల్సిన 4 శాతం పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. కాకపోతే భూవినియోగ మార్పిడి చేసినందుకు ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జీలను వసూలు చేయాల్సిందిగా ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ల్యాండ్ కన్వర్షన్ చేయించాలంటే రెవెన్యూ అధికారులు మూడు నెలల సమయం తీసుకునే వారు. దీని వలన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తీవ్రంగా నష్టం కలిగేది. నాలా చట్టం రద్దు తరువాత వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాలకు మార్చుకునే ప్రక్రియ సులభతరం అయ్యింది.

జోరందుకోనున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారం

జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజన్ కేంద్రాలతో పాటు బి.కొత్తకోట, అంగళ్లు, వాల్మీకిపురం, పీలేరు, రైల్వేకోడూరు, చిన్నమండ్యం, ములకలచెరువు, పుల్లంపేట తదితర వాణిజ్య కేంద్రాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది. ల్యాండ్ కన్వర్షన్‌తో అవస్థలు పడిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నాలా చట్టం రద్దుతో ఉపశమనం కలుగుతోంది. వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వాటిని లేఅవుట్‌లు వేసి అభివృద్ధి చేయడంలో భాగంగా వ్యాపారులు కేవలం ఈడీసీ చెల్లిస్తే సరిపోతుంది. ఈ క్రమంలో నాలా చట్టం రద్దు చేస్తూ గత నెల 3వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ పేరిట ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో జిల్లాలోని ప్రధాన నగరాల వద్ద రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు ఈ భూములు కొనుగోలు చేసి ఈడీసీ చెల్లించి లేఅవుట్‌లు వేస్తున్నారు.

ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలి

నందలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నందలూరు ప్రజలు దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు. శనివారం మండల కేంద్రంలో దీపావళి టపాసుల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాసులు పేల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ సమస్యతో సేవలకు ఆటంకం

గాలివీడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంవాండ్లపల్లి, చంద్రాపురం, కమలామర్రి గ్రామాల ప్రజలు ఏడాదిగా నెట్‌వర్క్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సంస్థ మూడు టవర్లను ఏర్పాటు చేసినా అవి పనిచేయడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ టవర్లు ఎయిర్- లింక్ మోడ్‌లో మాత్రమే పనిచేస్తున్నందున నెట్‌వర్క్ స్థిరంగా లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు. ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్లు అందుబాటులో లేని ఈ ప్రాంతాల్లో ప్రజలు పూర్తిగా బీఎస్ఎన్ఎల్ సేవలపైనే ఆధారపడుతున్నారు. తరచూ కనెక్టివిటీ అంతరాయాలు ఏర్పడటంతో విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ అధ్యక్షుడితో రూపేశ్‌రెడ్డి భేటీ

ఓబులవారిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధన్వంతరి జయంతి సందర్భంగా తిరుపతిలో శనివారం నిర్వహించిన సంజీవిని స్వరం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మండలబీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేశ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో బీజేపీ స్థితిగతులపై ఆయనతో చర్చించారు.

రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి : చమర్తి

● ఏకగ్రీవంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు



సుబ్రమణ్యం నాయుడు రాజంపేట టౌన్ | రవికుమార్ నాయుడు రూరల్ | జంగంశెట్టి సుబ్బయ్య, నందలూరు | గజ్జల నరసింహారెడ్డి ఒంటిమిట్ట | రాజశేఖర్ యాదవ్, సిద్ధవటం | భానుగోపాల్ రాజు, వీరబల్లె

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరి సహకారంతో సుండుపల్లె మినహా అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఇతర స్థానాలను భర్తీ చేసినట్లు రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. శనివారం ఆయన ఆంధ్ర జ్యోతితో మాట్లాడుతూ రాజంపేట పట్టణ అధ్యక్ష స్థానాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. రెండు రోజుల్లో సుండుపల్లె మండల స్థానాన్ని కూడా ఎన్నుకుంటామన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవం కావడం నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తల ఐక్యతను చాటుతోందన్నారు. ఇదే ఐక్యతను కొనసాగిస్తూ నియో జకవర్గంలో అందరిని కలుపుకుని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో వందశాతం స్థానాలను కైవసం చేసుకుం టామన్నారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి భారీ మెజారిటీతో గెలుపొందడానికి ఇప్పటి నుంచే గ్రామాలవారీగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. అన్ని సింగిల్ విండో పాలక మండళ్లను, ప్రధాన ఆలయాల చైర్మన్, డైరెక్టర్ల స్థానాలు కూడా భర్తీ అయ్యాయన్నారు. దశలవారీగా ప్రధాన నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధి, ఇంటింటా సంక్షేమం అమలుకు చర్యలు తీసుకుంటా మన్నారు.

మండల టీడీపీ అధ్యక్షులు వీరే..

రాజంపేట పట్టణ అధ్యక్షుడుగా దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు(డీఆర్ఎల్ మణి), రాజంపేట రూరల్ అధ్యక్షుడిగా మేడికొండ రవికుమార్‌నాయుడు, నందలూరు మండల అధ్యక్షుడిగా జంగంశెట్టి సుబ్బయ్య, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడిగా గజ్జల నరసింహారెడ్డి, సిద్దవటం మండల అధ్యక్షుడిగా కె.రాజశేఖర్‌యాదవ్, వీరబల్లె మండల అధ్యక్షుడిగా ఎం.బానుగోపాల్‌రాజు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత : డీపీవో

● జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ



స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీలో డీపీవో రాధమ్మ

రాయచోటి - నేతాజీ సర్కిల్ , అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అన్నారు. శనివారం సంబేపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, పాశ్చాత్య దేశాలు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇంట్లో అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ కవర్లను వినియోగించాలని సూచించారు. సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల సిబ్బందితో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కలిముల్లాబేగం, మాజీ సర్పంచ్ గోపాల్, మండల జేఈ మాబూసాహెబ్, మట్లి వేణుగోపాల్ నాయుడు, బొడ్గు భాస్కర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవి పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి, నేతాజీ సర్కిల్ వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలతో కలిసి ర్యాలీ, నేతాజీ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రెడ్డెయ్య, మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, టీడీపీ యువ నాయకుడు పక్కీరయ్య, ముక్తార్‌అహ్మద్, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో సునీల్‌కుమార్, కార్యదర్శి సురేష్, రామ్మోహన్, పాల్గొన్నారు.

వీరబల్లి: మండల మహిళా సమాఖ్య ఆవరణంలో మొక్కలు నాటారు. బస్టాండు ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.ఎంపీడీవో జోహార్‌బాబు, ఏపీఎం ఖాదర్‌వలి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్, ఈవోపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

గాలివీడు: మండల కేంద్రంలో మండల అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో చంద్రమౌళి మొక్కలు నాటారు. ఎంఈవో నాగరాజు, శ్రీనివాసులు, ఏపీవోలు రామచంద్ర, హరిప్రసాద్, గ్రామ కార్యదర్శులు, టీచర్లు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించాలి



విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ చేస్తున్న జడ్జి తేజసాయి

రైల్వేకోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించి ఉద్యోగాలు సాధించాలని రైల్వేకోడూరు కోర్టు జడ్జి పీ.జే తేజసాయి ఆకాంక్షించారు. శనివారం మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు అవా ర్డులను పంపిణీ చేశారు. తన అన్న జ్ఞాపకార్థం పాములపాటి సుబ్బ రాయుడు విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండో బహు మతి రూ. 2 వేలు, ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి రూ. 3 వేలు, బెస్ట్ స్టూడెంట్స్‌కు బహుమతులు అందజేశారని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అద్దెపల్లి వెంకట్రామరాజు, సీనియర్ న్యాయ వాదులు శంకరయ్య, గజపతి వర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే. రమేష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

పుల్లంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పుల్లంపేటలో తన సొంత నిధులతో శనివారం రహదారికి మరమ్మతులు చేయించారు. రెండేళ్ల క్రితం పుల్లంపేట - చిట్వేలి రోడ్లలో రహదారి విస్తరణ పనులు చేపట్టి సిమెంటు రోడ్డు కూడా వేశారు. అయితే పోలీసు స్టేషన్‌కు ఎదురుగా వంద మీటర్ల వరకు సిమెంటు రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో వర్షం వచ్చినప్పు డల్లా అక్కడ నీరు నిలిచి స్థానికులకు, పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు పోలీసులు, సైనికులుగా ఎదగాలి



స్కౌట్ అండ్ గైడ్స్ ప్రవేశ పత్రాలను అందజేస్తున్న ఎస్ఐ రవికుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పోలీసు సైనికులుగా ఎదగాలని సంబేపల్లె ఎస్ఐ రవి కుమార్ తెలియజేశారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్ సంబేపల్లెలో నిర్వ హించిన స్కౌట్ అండ్ గైడ్స్ ప్రవేశ పత్రాల పంపిణీలో ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రవేశ పత్రాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, స్కౌట్ మాస్టర్ మురళీనాయక్, గైడ్ కెప్టెన్ శశికళ, పీఈటీ షామీర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని లక్కిరెడ్డిపల్లె సీడీజీవో జహరాబీ తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీ గర్ల్స్ హైస్కూల్‌లో బాలికా దినోత్సవాలు నిర్వహించారు. రం డైరీలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, రూపాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

e-procurement tender notice			
RAJAMPET MUNICIPALITY			
S. No.	'e' - Procurement Notice No.	Number of Works	Estimate Contract in Lakhs
	48/workers/DEE/AE/2025-26	1	18.90
	Bid document download start date	19-10-2025, 10.00AM	
	Bid document download end date	03-11-2025, 3.00 PM	
	Last date of receipt of Tender	03-11-2025, 3.30 PM	

Further details can be seen @ 'e' Procurement market place in https://tender.apeprocurement.gov.in/, Contract No. 99890 51971
COMMISSIONER, RAJAMPET MUNICIPALITY

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన



రైల్వేకోడూరు: ర్యాలీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

నందలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడి పల్లె బాలికల జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన, వృక్ష శాస్త్ర అధ్యాపకుడు నాగిశెట్టి లక్ష్మీనారాయణ జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో శోభాయాత్ర నిర్వహించారు. రాజంపేట డిప్యూటీ డీఈవో ఎల్.నాగయ్య, మండల విద్యాశాఖాధికారి అనంతకృష్ణ ప్రసంగించారు. ఏ వస్తువులు కొనుగోలు చేసినా ఏ మేర పన్ను చెల్లించాలనే విషయంపై అందరికి చక్కగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంటు ముక్కల వెంకటరమణ, మస్తాన్, రాజేంద్ర, సంపత్ పవన్ కుమార్, దీపాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : జీఎస్టీ తగ్గింపు ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం డ్రైవర్లు, ప్రజలకు సూపర్ జీఎస్టీతో ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

డిమాండ్స్ నెరవేరకుండా సమ్మె విరమణ శోచనీయం

● విద్యుత్ కార్మిక స్ట్రగుల్ కమిటీ నేతలు

రాయచోటిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల ప్రధాన డిమాండ్స్ నెరవేరకుండా జేఏసీ నేతలు సమ్మె విరమించడం శోచనీయమని స్ట్రగుల్ కమిటీ నాయకులు ఏవీ రమణ, కే. సుబ్రమణ్యంరాజు, టీవీ రమణ, ఏ. రామాంజులు అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయడం, గ్రేడ్-2 జేఎల్ఎంల సమస్యల పరిష్కారం, పాత పెన్షన్ వర్తింపజేయని పక్షంలో సమ్మె చేస్తామని జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. ఇదే అంశాల మీద ఇప్పటికే జిల్లాల్లోని డిస్కమ్‌ల వద్ద, గత నెలలో విద్యుత్ సౌధ వద్ద ధర్నా కూడా నిర్వహించామన్నారు. జేఏసీ కూడా ఇదే ప్రధాన డిమాండ్స్‌తో సమ్మెకు పిలుపునివ్వడంతో స్ట్రగుల్ కమిటీ కూడా పోరాటానికి సిద్ధమైందన్నారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించడం ద్వారా సంస్థకు రూ.200 కోట్లు మిగులుతుందన్నారు. మిగులు నిధులతో పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించవచ్చునని, ఈ పద్ధతిలోనే పక్కనున్న తెలంగాణాలో చెల్లిస్తున్నారని, వారికి అడు రాని చట్టాలు, ఇబ్బందులు ఆంధ్ర రాష్ట్రానికి ఎందుకు అడ్డొస్తు న్నాయో చెప్పాలన్నారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించే విధానాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రధాన డిమాండ్స్ నెరవేరే వరకు దశల వారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

22 నుంచి విద్యారంగ సమస్యలపై బస్సు జాతా..

రాయచోటి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం లక్ష్యంతో 22వ తేదీ నుంచి నవంబర్ 12వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహిస్తున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలో బస్సు జాతాకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో మూతపడిన 4500 ప్రభుత్వ పాఠశాలలను వెంటనే పునఃప్రారంభించాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నారాయణ, కుమార్, రఘుపతి, రెడ్డికుమార్, వంశీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షలతో శాస్త్రీయ పరిజ్ఞానం

వీరబల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం చెకుముకి ప్రతిభ పరీక్షలు తోడ్పడుతాయని మట్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. శనివారం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

చిట్వేలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతినెలా క్లస్టర్ కాంప్లెక్సు సమా వేశాలు నిర్వహించాలని ఎంఈవో ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక విద్యావనరుల కార్యాలయంలో శనివారం కొత్త ఉపాధ్యాయులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. అందుకు పాటించాల్సిన విధి విధానాలను వివరించారు.

రైల్వే కోడూరులో దంచికొట్టిన వాన



జలమయమైన టీవీఎస్ షోరూం సమీపంలోని రోడ్డు

రైల్వేకోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వర్షం దంచికొట్టింది. దీంతో రైల్వేకోడూరు ప్రధానదారి జలమయ మైంది. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. గుంజన నది లోకి నీరు చేరింది. రైల్వేకోడూరు పట్టణంలోని పలు వీధి రోడ్లు జలమయ మయ్యాయి. దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. పట్టణంలో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు, బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వర్షం దెబ్బపడింది. బాణసంచా తడిసిపోతే.. తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఇక వర్షం కారణంగా టపాసులు పేలుతాయో లేదో అని పిల్లలు ఆందోళన పడుతున్నారు.

మాయా పెట్టె.. ఆటపాటలు తెచ్చే..


బొమ్మలతో కూడిన మాయాపెట్టె



● పెట్టెలో ఆకర్షణీయమైన 59 రకాల వస్తువులు ● ఆటపాటలతో విద్యాభ్యాసం
● చిన్నారుల్లో పునాది పటిష్టతకు అడుగులు ● పాఠశాల విద్యలో కొత్త సంస్కరణలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లల చిన్నచిన్న చేతుల్లో ఇపుడు మాయా పెట్టె. పేరు జాదూయి పిటార. కానీ ఇది మాయలు, మంత్రాలు కాదు. విజ్ఞాన భాండాగారం అని చెప్పాలి. పునాది దశలో పిల్లలు ఆటల ద్వారా నేర్చుకునేలా చేయడమే దీని లక్ష్యం. జాదూయి పిటార అనేది భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3-8ఏళ్ల పిల్లల కోసం ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఇందులో కథలు, తోలుబొమ్మలు, పజిల్స్, పోస్టర్లు, ఫ్లాష్‌కార్డులు వంటివి కలిగి ఉంటుంది. ఇవి పిల్లల ఉత్సుకతను పెంచి స్థానిక భాషలు, సంస్కృతులను ప్రతిబింబిస్తాయి. ఇ-జాదూయి పిటార కూడా అందుబాటులో ఉంది. అలాగే ఏఐ ఆధారిత చాట్‌బోట్స్, టెలీగ్రామ్, వాట్సప్ ద్వారా లభిస్తుంది.

జాదూయి పిటార అంటే...

జాదూయి పిటార అంటే మాయా పెట్టె అని అర్థం. ఇది ముఖ్యంగా 3 నుంచి 8 సంవత్సరాల పిల్లల కోసం రూపొందించిన ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఈ పెట్టెలో కథల పుస్తకాలు, బొమ్మలు, పజిల్స్ ఫ్లాష్‌కార్డులు, పోస్టర్లు, వర్క్‌బుక్కులు, ఆంగ్లంతో పాటు స్థానిక భాషలలో కూడా అందుబాటులో ఉండే వివిధ రకాల అభ్యాస వస్తువులు ఉంటాయి. ఇవి అభ్యాసానికి చురుకైన, అభివృద్ధికి తగిన విధానాన్ని అందిస్తాయి, ఇది విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా చిన్నారుల్లో అవసరమైన సామాజిక, భావోద్వేగ అభిజ్ఞా సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను కూడా పెంపొందిస్తుంది.

ప్రధాన లక్ష్యం

పిల్లలో సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలు పెంచి అభ్యాసాన్ని ఆనందదాయకంగా చేయడమే జాదూయి పిటార ప్రధాన లక్ష్యం. పుస్తక భారం కాకుండా, ఆటల్లోనే విద్య అనే నూతన శకానికి ఇది ఆరంభమని చెప్పవచ్చు.


మాయాపెట్టెలోని ఆట వస్తువులు

ఆడుతూ నేర్చుకోవడం అనే సూత్రాన్ని సాకారం చేస్తూ ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. పిల్లలు బొమ్మలు, పజిల్స్ కథలు, ఫ్లాష్‌కార్డులు, తోలుబొమ్మలతో ఆడుతూ అక్షరాలు, అంకెలు, రంగులు, ఆకారాలు నేర్చుకుంటారు. పాఠం అంటే భయం కాదు.. ఆటల్లోనే పాఠం అనే భావనను పెంపొందిస్తోంది.



ఆట ఆధారిత అభ్యాసం

వర్క్‌బుక్కులు


తోలుబొమ్మలు

భారతీయతకు ప్రతిబింబం

జాదూయి పిటార కేవలం ఆటపాటలకే కాదు.. భారతీయ సంస్కృతి, స్థానిక భాషలు, సామాజిక విలువలను ప్రతిబింబించేలా రూపొందించబడింది. పిల్లలు తమ చుట్టూ ఉన్న గ్రామం, కుటుంబం, పండుగలు, సంప్రదాయాలను నేర్చుకుంటూ ఎదుగుతారు.

ఆటలతో కూడిన బోధన..



పిల్లలకు ఆటలతో కూడిన బోధన కల్పించాలనే లక్ష్యంతో జాదూయి పిటార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. మాయాపెట్టెలో కథలు, బొమ్మలు, పజిల్స్, పోస్టర్లు ఇలా 59 రకాల వస్తువులు ఉంటాయి. ప్రధానంగా పిల్లలకు పాటలతో వినోదం కల్పిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు మాయాపెట్టె పంపించడం జరిగింది. శనివారం నాటికి అన్ని పాఠశాలల్లో మాయాపెట్టె అందుబాటులో ఉంటుంది. - **నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏ ఏపీసీ**

మత స్వేచ్ఛ చట్టం అమలు చేసేందుకు కృషి

● ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పీఠాధిపతులు


పీఠాధిపతుల సదస్సులో మాట్లాడుతున్న విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీఠాధిపతులు అందరూ కలిసి ఏపీలో కూడా మత స్వేచ్ఛ చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. మండలంలోని తోట్లపల్లె గ్రామంలో వెలసియున్న అచలానంద ఆశ్రమంలో శనివారం ప్రాంత ధర్మాచార్యుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఇప్పటికే 14రాష్ట్రాల్లో మత స్వేచ్ఛ చట్టం అమల్లోకి తెచ్చారని, ఏపీలో కూడా మత ప్రచార స్వేచ్ఛ చట్టం అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామన్నారు. ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పాల్గొన్న పీఠాధిపతులు అందరూ కలిసి ఏడు ప్రధాన అంశాలను తీర్మానించడం జరిగిందని ఆయన తెలిపారు. భారతదేశ ఐక్యత, అఖండత, సాంస్కృతిక గుర్తింపు ధర్మంపై ఆధారపడి ఉన్నందున ధర్మాన్ని కాపాడడం ప్రతి పౌరుడి పవిత్ర కర్తవ్యమని, హిందూ దేవాలయాల నిర్వహణ ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేయాలని తీర్మానించారు. దేశంలోని ప్రతి పట్టణం, గ్రామంలో స్వామీజీలు, ఆధ్యాత్మిక నాయకులు అవగాహన కార్యక్రమాలు చేపట్టి కొన్ని ప్రభుత్వాలు రూపొందించిన మత మార్పిడి నిషేధ చట్టాలు ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. భారత జాతిని బలహీన పరిచే కుల భాషా ప్రాంత బేధాలను అధిగమించి సాంస్కృతిక జాతీయ భావాలతో స్వశక్త సమర్థ భారత నిర్మాణానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. భారత యువత ధర్మాన్ని కాపాడడం అంటే దేశాన్ని కాపాడడమేనన్నారు. మోసపూరిత మత మార్పిడిల వల్ల సంస్కృతీ సాంప్రదాయాలు కోల్పోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి దాదాపు 500 మంది పీఠాధిపతులు హాజరయ్యారు.

పారదర్శకంగా స్కేటింగ్ ఎంపికలు


స్కేటింగ్ పోటీల్లో చిన్నారులు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో శనివారం స్కేటింగ్ ఎంపికలు పారదర్శకంగా జరిగాయి. ఉదయం 6గంటలకు యోగి వేమన యూనివర్శిటీలో రోడ్‌రేస్ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ వయసు గల వారికి గ్రూపుల వారీగా ఈ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌ను అందించారు. అనంతరం కడప డీఎస్ఏ మైదానంలో రింక్ రేస్ ఎంపికలకు 4 నుండి 6, అలాగే 6 నుండి 8, 8 నుండి 10, 10 నుంచి 12, 12 నుంచి 15, 15 నుండి 18, 18 ఆపై వయసు గలవారికి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌ను డీఎస్‌డీవో గౌస్‌బాషా, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి అందించారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా ఆంజనేయులు, కోచ్‌లు విలియం కేరీ, మహేశ్, నాగేంద్ర, నారాయణ, శ్రీనివాస్, హర్ష, అనిల్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : డీఎస్‌డీవో

కడప స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్‌బాషా స్పష్టం చేశారు. శనివారం స్థానిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఉన్న తన చాంబరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ఏ మైదానంలో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేలా ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, కబడ్డీ, జిమ్, స్కేటింగ్ తదితర క్రీడలకు సంబంధించి కోచ్‌లు ఉన్నారని, వాలీబాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్ క్రీడలకు ప్రస్తుతం కోచ్‌లు లేరని తెలిపారు. త్వరలో సంబంధిత క్రీడాకారుల ప్రధాన కార్యాలయం (విజయవాడ) నుండి ఆదేశాలు రానున్నాయని, అనంతరం కోచ్‌లు లేని క్రీడలకు సైతం కోచ్‌లు నియమించి క్రీడల పురోగతికి బాటలు వేస్తామన్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటి గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ గల క్రీడాకారులుగా తయారు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ ఉదయం 6 నుండి 8.30గంటల వరకు, అలాగే సాయంత్రం 4గంటల నుండి 6.30గంటల వరకు ఈ క్రీడా విభాగాల్లో బయట నుంచి వస్తున్న క్రీడాకారులకు స్టేడియంలో శిక్షణ ఇస్తాన్నామన్నారు. ప్రస్తుతం కోచ్‌లున్న క్రీడలకు ఒక్కో క్రీడకు 30మంది చొప్పున క్రీడాకారులు శిక్షణకు వస్తున్నారన్నారు.

క్రేన్ కిందపడి వృద్ధుడు మృతి


మృతి చెందిన వృద్ధుడు


ముద్దనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పులివెందుల రోడ్డులోని పుల్లేరు వంక సమీపంలో శనివారం గుర్తుతెలియని వృద్ధుడు క్రేన్ కింద పడి మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. దాదాపు 65 సంవత్సరాలు ఉన్న గుర్తుతెలియని వృద్ధుడు నడుచుకుంటూ వెళుతుండగా క్రేన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


జగదీష్ (ఫైల్)

చక్రాయపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లెలో గండికోట జగదీష్ (18) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు... జగదీష్ తల్లిదండ్రులు కువైట్‌లో ఉండగా లక్కిరెడ్డిపల్లెలోని అవ్వ ఉండేవాడు. శుక్రవారం ఓబుళనాయునిపల్లెకు వచ్చి తల్లిదండ్రులకు ఫోన్ చేసి బైక్ కావాలని కోరడంతో వారు మందలించారని, అతనికి మతిస్థిమితం లేనట్లు కూడా తెలిపారు. బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకోగా శనివారం గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లెకు తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

ఓబులవారిపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చిన్నఓరంపాడుకు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి వాహనం అదుపు తప్పడంతో గాయాలపాలయ్యాడు. దీనికి తోడు మూర్ఛ వ్యాధి రావడంతో అదే సమయంలో అటువైపు వెళుతున్న పోలీసులు వెంటనే అతడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, అతనికి స్పృహ లేకపోవడంతో వివరాలు తెలియలేదు. బంధువులు ఎవరైనా ఉంటే కడప రిమ్స్ ఆసుపత్రిలో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

పెన్నానదిలో వ్యక్తి గల్లంతు

సిద్దవటం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంతాటిపల్లె వద్ద పెన్నానదిలో చేపల వేటకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన పొట్టిగాండ్ల నందా(36) గల్లంతైనట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


గాలిస్తున్న గ్రామస్థులు, పోలీసులు

నకిలీ మద్యానికి 'సురక్ష యాప్'తో చెక్

కడప క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ 'సురక్ష మొబైల్ యాప్'ను ఆవిష్కరించిందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజు అన్నారు. కడప నగరంలోని పలు మద్యం దుకాణాలను కడప ఎక్సైజ్ క్రిష్ణకుమార్‌తో కలిసి ఆయన శనివారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసేటప్పుడు అది ఒరిజినలో, డూప్లికేటో తెలుసుకునేందుకు యాప్ ద్వారా స్కాన్ చేస్తే తెలిసిపోతుందన్నారు. కస్టమర్లు ఈ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నకిలీది అయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 14405కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.


కడపలో మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజు

జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థ విశ్వం

● విశ్వం అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ తదితర వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలోగాని, 8688888802/9399976999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి : ఐసీడీఎస్ పీడీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికల విద్య ప్రాముఖ్యత, అంతర్జాతీయ బాలిక దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ ఆఫీసరు హరిప్రసాద్, డీఈఎంవో డి.భారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అధికారులు

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

రాజంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. వీరికి 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఐదుగురి అరెస్టు

నందలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనమోహనపురం క్రాస్ సమీపంలో ఐదుగురిని అరెస్ట్ చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజం పేట రూరల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, నందలూరు సిబ్బంది, అన్నమయ్య ఆర్ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈనెల 17న మధ్యాహ్నం 3గంటలకు మండలంలోని ఎంఎం పురం క్రాస్‌రోడ్డు దగ్గరలో చాపల చిన్నయ్య పొలానికి ఉత్తర వైపున కంపచెట్లలో దాచి ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఆవుల రవికుమార్, పొత్తపి పెంచలయ్య, బండారు సందీప్, కానకపర్తి వంశీకృష్ణ, ఇమిడి నాగరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం సుమారు 512.9 కేజీలు ఉండగా, దాని విలువ సుమారు రూ.6.85 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో మరికొందరు పరారీలో ఉన్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తిరుపతిలోని ఆర్ఎస్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.


పోలీసుల అదుపులో ఎర్రచందనం దొంగలు


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

ఇంటర్మీడియట్ నాన్‌టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మల్లికార్జున రాజు


మల్లికార్జున రాజును సత్కరిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ అసిస్టెంట్ ఎస్.మల్లికార్జునరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఆయనకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.సురేశ్, జిల్లా బాడీ సభ్యులు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ

● ఐదుగురికి తీవ్రగాయాలు

రామాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బస్సు కారును ఢీకొనడంతో ఐదుగురికి గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళుతున్న కారును గువ్వల చెరువు ఘాట్ శివాలయం సమీపంలో మదనపల్లె నుంచి కడపకు వెళుతున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

● మరొకరికి గాయాలు

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయచోటి రోడ్డు పాలకేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాల పాలయ్యాడు. స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన కె.మహేంద్రారెడ్డి (18), కె.నరసింహులు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శనివారం సాయంత్రం వారు బైక్‌పై పుల్లంపేట మండలం ఎస్ఆర్ పాలెంలోని అటవీశాఖ పార్కుకు వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీ స్టాండును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మహేంద్రారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న నరసింహులు గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ నాగార్జున, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన మహేంద్రారెడ్డి

కోళ్లబైలులో సీపీఐ నిరసన

మదనపల్లె అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను అరికట్టాలని కోరుతూ శనివారం కోళ్లబైలులో సీపీఐ నేతలు నిరసన చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూములను అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నివారించాలన్నారు. ఇప్పటికే అనేక సార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిశేఖర్, సీపీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శనేశ్వరస్వామికి మహాతైలాభిషేకం


మహాతైలాభిషేకంలో హారతి ఇస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, విశేష భక్తజనం నడుమ శనివారం శనేశ్వరుడికి ప్రదోషకాల మహాతైలాభిషేకం వైభవంగా సాగింది. అనంతరం విశేషాలంకరణతో పూజలు, ప్రత్యేక హోమాలు జరిగాయి. ఇక్కడికి పట్టణంలోని వారే కాక ఇతర ప్రాంతీయులు సైతం పాల్గొనడం విశేషం. కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగివుండాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లను పిలిచి తగుసూచనలు చేసిన ఆయన మాట్లాడుతూ గతంలో రౌడీషీటర్లుగా నమోదైన వారు పద్ధతి మార్చుకుని ప్రజాజీవితంలో కలిసి జీవించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే మళ్లీ జైలుకు పంపుతామని హెచ్చరించారు. ముఖ్యంగా స్థానిక ఎన్నికలు వస్తున్నందున ఎలాంటి గొడవలకు పోకుండా మంచి ప్రవర్తన కలిగివుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ట్రెనీ ఎస్ఐ శ్రీప్రియ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి


గొర్రెపిల్లల కళేబరాల వద్ద విలపిస్తున్న దృశ్యం

బి.కొత్తకోట అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గొర్రె పిల్లల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 30కి పైగా గొర్రెపిల్లలు చనిపోయాయి. బాలసానిపల్లె వాసి ముత్తమ్మగారి బాబు గొర్రెలను మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం గొర్రెలను మేపడానికి తీసుకెళ్లాడు. ఉదయం నుంచీ వర్షం కురుస్తూ ఉండడంతో మందలోకి రాలేని గొర్రె పిల్లలను ఇంటి వద్దే గొర్రెల దొడ్డిలో వదిలి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే గొర్రెల దొడ్డిలో ఉన్న గొర్రెపిల్లలను వీధి కుక్కలు చంపేశాయి. ప్రాణంగా పెంచుకున్న పిల్లలను విగత జీవులుగా చూసి దంపతులు విలపించారు. రూ. 1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వివరించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కలకడ. అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోన క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మనోహర్‌కు గాయాలయ్యాయి. గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పసలవాండ్లపల్లి వాసి మనోహర్ కలకడ వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో బాధితుడి తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం 108లో మహల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భాగ్యమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారత, బాలికల విద్య ప్రాముఖ్యత, బాలికల ఆరోగ్యం, బాల్యవివాహాలతో కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికల హక్కులపై అవగాహన కల్పించారు సూపర్ వైజర్లు హిజాద్ ప్యారీ, భవాని, రామలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిణ్సిపాల్ శివకుమారి, హెచ్ఎం. రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

24న నెట్‌బాల్ జట్ల ఎంపిక

వాల్మీకిపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్త మంచూరు జడ్పీ హైస్కూల్‌లో 24న శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాలబాలికల నెట్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డివర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సెలెక్షన్స్‌కి వచ్చే క్రీడాకారులు ఆన్‌లైన్ చేసిన ధ్రువపత్రం, అపార్ నెంబరు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు.

టపాసుల విక్రయాలపై నిబంధనలు పాటించాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటిస్తూ బాణసంచా విక్రయించాలని తహసీల్దారు శ్రీనివాసులు ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తహసీల్దారు తనిఖీ చేశారు. దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ అధికారులు సూచించిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ టపాసులు విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు టపాసులను విక్రయించరాదన్నారు. దుకాణాల వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట వీఆర్వో నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

సింగిల్‌విండో త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా గుత్తికొండ త్యాగరాజు



ములకలచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోంపల్లె సింగిల్ విండో త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా గుత్తికొండ త్యాగరాజును నియమిస్తూ ప్రభుత్వ సహకార శాఖ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోంపల్లె సహకార సంఘానికి ముగ్గురు సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని నియమించారు. ప్రస్తుతం రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజును సింగిల్‌విండో అధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పార్టీ పరిశీలకులు దినేష్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా

తంబళ్లపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడంతో విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని విద్యుత్ ఏఈ సురేంద్ర అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ థామస్ రాజుతో కలసి పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, సోలార్‌తో కలిగే ప్రయోజనాలు, ఏర్పాటు విధానాన్ని వివరించారు. పథకంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఏర్పాటు చేసుకునేలా చైతన్య పరచాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.



జీఎస్టీపై అవగాహన ర్యాలీ


లక్కీ డిప్ విజేతకు హెల్మెట్ బహూకరిస్తున్న ఎంవీఐ విజయలక్ష్మి

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలపై సామాన్యులకు అవగాహన కల్పిస్తూ రవాణ శాఖ ఆధ్వర్యంలో శనివారం పీలేరులో స్కూటర్ ర్యాలీ జరిగింది. పీలేరు ఎంవీఐ విజయలక్ష్మి తన కార్యాలయం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ 2.0 కారణంగా రవాణ రంగ అభివృద్ధికి ఊతం లభించిందన్నారు. అనేక వాహనాలు, వాటి విడిభాగాల ధరలు తగ్గాయన్నారు. వాటిని సామాన్యులకు చేరువ చేసేందుకు అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ద్విచక్ర వాహనదారులకు లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు హెల్మెట్లను బహూకరించారు. కార్యక్రమంలో పీలేరు జీఎస్‌టీఓ శివయ్య, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు, ఆటో యూనియన్ నేతలు, డీలర్లు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలను వినియోగించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి

బి.కొత్తకోట అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంక్ సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గోళ్లపల్లెలోని నూతన భవనంలో శాఖను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌బీఐ తరువాత స్థానంలో గ్రామీణ బ్యాంకు లావాదేవీలు రూ. 1.30 లక్షల కోట్లతో నడుస్తున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి సురక్షా యోజన, జీవనజ్యోతి, జనధన్‌యోజన, ఖాతాల ప్రారంభంలో తమ బ్యాంకు ముందువరుసలో ఉందన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి, ఆంధ్రప్రగతి, ఏపీ గ్రామీణ వికాసం బ్యాంకులను అన్నింటినీ విలీనం చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలను అందిస్తూ, మహిళలు, యువత ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలను అందిస్తున్నామన్నారు. డిపాజిట్లపై ఎక్కువ వడ్డీని అందిస్తూ రుణాలపై తక్కువ వడ్డీని వసూలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ శంకర్రావు, రీజనల్ మేనేజర్ శంకర్‌ప్రసాద్, గోళ్లపల్లె శాఖ మేనేజర్ తేజేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.







మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుదాం


మార్కెట్‌యార్డులో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్మన్ శివరామ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌ను శుభ్రంగా వుంచుతూ స్వచ్ఛతను కాపాడుదామని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మార్కెట్‌లో చెత్త, కుళ్లిన టమోటాలు, ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. మార్కెట్ కార్యదర్శి జగదీష్, డైరెక్టర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యాన్ని తగ్గించాలి

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక అధికారులు, టీడీపీ నేతలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో పీలేరు ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి, ఎంపీడీఓ శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈఓ బ్రహ్మానంద రెడ్డి, కార్యదర్శులు జ్ఞాన, శివాజీ, రెడ్డిప్రసాద్, టీడీపీ నేతలు పోలిశెట్టి సురేంద్ర, షాదాబ్, కార్మిక సంఘ నేతలు ధనాశి వెంకటరామయ్య, రమణ, ఓబులేశు, మస్తాన్, మున్నా పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత అవసరం

నిమ్మనపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే స్వచ్ఛత అవసరమని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛ దివస్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ చెత్త సేకరణను చేపడుతున్నట్టే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి భూమిలో కరిగిపోయే వస్తువులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయమై ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కార్యాలయం నుంచి బస్టాండు వరకు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యకర జీవనం

కలకడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలితో మానవళి ఆరోగ్యవంత జీవనాన్ని సాగించవచ్చని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. బాలయ్యగారిపల్లిలో నేతలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథనాయుడు, నేతలు రైస్‌మిల్లు రమణ, వెంకటరమణ, ఎపీఓ సుజాత, కార్యదర్శి దేవేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యవంత జీవనం గడపవచ్చని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ అర్చనబాబు అన్నారు. ఆస్పత్రి ఆవరణలో డాక్టర్లు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు కీర్తి, స్పందన, రాధ, మాసూర్, ఈశ్వర్ రావు, నర్సింగ్ సూపరింటెంటెంట్స్ విజయ, హేమలత, నాగశ్రీ, పారిశుధ్య కార్మిక సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కురవంక పంచాయతీ కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి చలపతి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి మంజుల, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు మెంబర్లు , సిబ్బంది పాల్గొన్నారు.





'జనగణన చేసిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలి'


సమావేశంలో ఐక్యత తెలుపుతున్న బీసీ హక్కుల పోరాట సమితి నేతలు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనగణన చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ జనగణనను నిర్వహిచాలని, దీంతోనే బీసీ రిజర్వేషన్ ఆధారపడి ఉందన్నారు. బీసీలకు అన్యాయం జరగకుండా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 42 శాతం ఉన్నట్లు బీసీ సంఘాలు తెలుపుతున్నాయని ఇది ఎవరు ప్రకటించారని ప్రశ్నించారు. ఏపీలో కూడా కులాల ప్రాతిపదికన జనాభా లెక్కించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చిన్నరెడెప్ప, నేతలు రామాంజులు, కర్మద్‌బాషా, సిద్దయ్య, పోతబోలు వెంకటరమణ, వెంకటేష్, మోహన్‌బాబు, రాజుస్వామి, బి. వెంకటరమణ, ఉప్పు వెంకటేష్, హోహన్‌యాదవ్, గౌతమ్, శ్రీనివాసులు, కార్తీకాస్వామి, గౌతమ్‌స్వామి, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోచ్ అవినాశ్ రెడ్డికి ఘనసన్మానం


కోచ్ అవినాశ్ రెడ్డిని సన్మానిస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో తమ విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్న కోచ్ అవినాశ్ రెడ్డిని సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల కరస్పాండెంట్ చింతల విజయ భాస్కర రెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిద్దిడం క్రీడలపై ఆయనకున్న మక్కువ తెలపకనే చెబుతోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, రన్నర్స్‌గా నిలిచిన విష్ణువర్ధన్, మహమ్మద్ అలీ, కుషి, అబూబకర్, వసీం, వారిస్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్య జీవితం

వాల్మీకిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యమైన జీవితం సాధన సాధ్యమని మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. మూరేవాండ్లపల్లెలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిసరాల శుభ్రత, వ్యాధుల నియంత్రణ, తదితర వాటిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ రమేష్‌బాబు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.





మాయా పెట్టె.. ఆటపాటలు తెచ్చే..

- పెట్టెలో ఆకర్షణీయమైన 59 రకాల వస్తువులు
- ఆటపాటలతో విద్యాభ్యాసం
- చిన్నారుల్లో పునాది పటిష్టతకు అడుగులు
- పాఠశాల విద్యలో కొత్త సంస్కరణలు


బొమ్మలతో కూడిన మాయాపెట్టె





కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లల చిన్నచిన్న చేతుల్లో ఇపుడు మాయా పెట్టె. పేరు జాదూయి పిటార. కానీ ఇది మాయలు, మంత్రాలు కాదు. విజ్ఞాన భాండాగారమని చెప్పాలి. పునాది దశలో పిల్లలు ఆటల ద్వారా నేర్చుకునేలా చేయడమే దీని లక్ష్యం. జాదూయి పిటార అనేది భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3-8ఏళ్ల పిల్లల కోసం ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఇందులో కథలు, తోలుబొమ్మలు, పజిల్స్, పోస్టర్లు, ఫ్లాష్‌కార్డులు వంటివి కలిగి ఉంటుంది. ఇవి పిల్లల ఉత్సుకతను పెంచి స్థానిక భాషలు, సంస్కృతులు ప్రతిబింబిస్తాయి. ఇ-జాదూయి పిటార కూడా అందుబాటులో ఉంది. ఏఐ ఆధారిత చాట్‌బోట్స్, టెలీగ్రామ్, వాట్సాప్ ద్వారా లభిస్తుంది.

జాదూయి పిటార అంటే...

జాదూయి పిటార అంటే మాయా పెట్టె అని అ ర్థం. ఇది ముఖ్యంగా 3 నుంచి 8 సంవత్సరాల పి ల్లల కోసం రూపొందించిన ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఈ పెట్టెలో కథల పుస్తకాలు, బొమ్మలు, పజిల్స్, ఫ్లాష్‌కార్డులు, పోస్టర్లు, వర్క్‌బుక్కులు, ఆంగ్లంతో పాటు స్థానిక భాషలలో కూడా అందుబాటులో ఉండే వివిధ రకాల అభ్యాస వస్తువులు ఉంటాయి. ఇవి అభ్యాసానికి చురుకైన, అభివృద్ధికి తగిన విధానాన్ని అందిస్తాయి, ఇది విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా చిన్నారుల్లో అవసరమైన సామాజిక, భావోద్వేగ అభిజ్ఞా సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను కూడా పెంపొందిస్తుంది.

ఆట ఆధారిత అభ్యాసం

ఆడుతూ నేర్చుకోవడం అనే సూత్రాన్ని సాకారం చేస్తూ ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. పిల్లలు బొమ్మలు, పజిల్స్, కథలు, ఫ్లాష్‌కార్డులు, తోలుబొమ్మలతో ఆడుతూ అక్షరాలు, అంకెలు, రంగులు, ఆకారాలు నేర్చుకుంటారు. పాఠం అంటే భయం కాదు.. ఆటల్లోనే పాఠం అనే భావనను పెంపొందిస్తోంది.

భారతీయతకు ప్రతిబింబం

జాదూయి పిటార కేవలం ఆటపాటలకే కాదు.. భారతీయ సంస్కృతి, స్థానిక భాషలు, సామాజిక వి లువలను ప్రతిబింబించేలా రూపొందించారు. పిల్లలు చుట్టూ ఉన్న గ్రామం, కుటుంబం, పండుగలు, సంప్రదాయాలను నేర్చుకుంటూ ఎదుగుతారు.



ప్రధాన లక్ష్యం

పిల్లలో సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలు పెంచి అభ్యాసాన్ని ఆనందదాయకంగా చేయడమే జాదూయి పిటార ప్రధాన లక్ష్యం. పుస్తక భారం కాకుండా, ఆటల్లోనే విద్య అనే నూతన శకానికి ఇది ఆరంభమని చెప్పవచ్చు.


మాయాపెట్టెలోని ఆట వస్తువులు

ఆటలతో కూడిన బోధన..



పిల్లలకు ఆటలతో కూడిన బోధన కల్పించాలనే లక్ష్యంతో జాదూయి పిటార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. మాయాపెట్టెలో కథలు, బొమ్మలు, పజిల్స్, పోస్టర్లు ఇలా 59 రకాల వస్తువులు ఉంటాయి. ప్రధానంగా పిల్లలకు పాటలతో వినోదం కల్పిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు మాయాపెట్టె పంపించడం జరిగింది. శనివారం నాటికి అన్ని పాఠశాలల్లో మాయాపెట్టె అందుబాటులో ఉంటుంది. **- నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏ ఏపీసీ**

పొంగి పొర్లిన హంద్రీ-నీవా జలాలు

- దెబ్బతిన్న రోడ్డు, పంటపొలాలు


హంద్రీ-నీవా జలాలు పొంగడంతో దెబ్బతిన్న రోడ్డు

కురబలకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట సమీపంలోని పగడాలవారిపల్లె వద్ద హంద్రీ-నీవా జలాలు పొంగి పొర్లాయి. హంద్రీ-నీవా జలాలు పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కుప్పంకు తరలిస్తున్నారు. కాగా మార్గ మధ్యలోని కురబలకోట మండలం పగడాలవారిపల్లె వద్ద బుధవారం రాత్రి కురిసిన వర్షంతో పాటుగా హంద్రీ-నీవా జలాల ప్రవాహం అధికమవడంతో పొంగినాయి. కాగా మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉంది. అయితే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగడంతో నీటిని పంపింగ్ చేయకపోవడంతో పొంగడంతో రోడ్డు, పంటపొలాలు దెబ్బతిన్నాయి. కాగా ఎంపీడీవో గంగయ్య, రెవెన్యూ ఆర్ఐ శేషాద్రి అక్కడికి వెళ్ళి నష్టపరిహారంపై అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు.

పీలేరు కోర్టులకు ప్రత్యామ్నాయ భవనాలు

- పరిశీలించిన చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక


పీలేరులో శిథిలావస్థలో ఉన్న జడ్జి క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న జడ్జి అరుణ సారిక

పీలేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని కోర్టుల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాలను శనివారం చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక పరిశీలించారు. పీలేరులో ప్రస్తుతం కోర్టులు నడుస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, వాటిల్లో కోర్టులు నిర్వహించడం ప్రమాదకరంగా మారడంతో జడ్జి ప్రత్యామ్నాయ భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులను మదనపల్లె మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్ భవనంలో నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ఆ భవనాన్ని పరిశీలించారు. పీలేరులోని కోర్టుల కోసం స్థానిక ఈద్గాహ్ మైదానం పక్కనున్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములను గతంలో ప్రభుత్వం కేటాయించింది. అక్కడ నూతన భవనాల నిర్మాణం జరిగే వరకు ప్రత్యామ్నాయ భవనాల్లో కోర్టులు నిర్వహిస్తామని తెలిపారు. మదనపల్లె మార్గంలో శిథిలావస్థలో ఉన్న జడ్జి క్వార్టర్స్, పీలేరు సబ్-జైలును తనిఖీ చేశారు. జడ్జి క్వార్టర్స్‌ను పూర్తిగా తొలగించి నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ డీఈ సురేశ్‌ను ఆదేశించారు. సబ్-జైలులో ఖైదీలకు అన్ని వసతులు కల్పించాలని జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. పీలేరు జడ్జిలు మహేశ్, జియావుద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టీసీ పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, న్యాయవాదులు చంద్రశేఖరరెడ్డి, భవానీ శంకర, నిరంజన్, ఇమ్రాన్, ఈశ్వరరెడ్డి, రాజేంద్ర బాబు, ఎంపీడీవో శివశంకర్, ఈఓ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు జ్ఞాన, శివాజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత స్వేచ్ఛ చట్టం అమలు చేసేందుకు కృషి

- ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పీఠాధిపతులు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీఠాధిప తులు అందరూ కలిసి ఏపీ లో కూడా మత స్వేచ్ఛ చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వా మి తెలిపారు. తోట్లపల్లెలో వెలసియున్న అచలానంద ఆశ్రమంలో శనివారం ప్రాంత ధర్మాచార్యుల సద స్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఇప్పటికే 14రాష్ట్రాల్లో మత స్వేచ్ఛ చట్టం అమల్లోకి తెచ్చారని, ఏపీలో కూడా మత ప్రచార స్వేచ్ఛ చట్టం అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విన్నవిస్తు న్నామన్నారు. దేశంలోని ప్రతి పట్టణం, గ్రామంలో స్వామీజీలు, ఆధ్యాత్మిక నాయకులు అవగాహన కార్యక్ర మాలు చేపట్టి కొన్ని ప్రభుత్వాలు రూపొందించిన మత మార్పిడి నిషేధ చట్టాలు ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. భారత జాతిని బలహీన పరిచే కుల భాషా ప్రాంత బేధాలను అధిగమించి సాంస్కృతిక జాతీయ భావాలతో స్వశక్త సమర్థ భారత నిర్మాణానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థ విశ్వం

- విశ్వం అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం, 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లలోగాని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే త్వరగా పూర్తి చేయాలి


పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న గపూర్

రామసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యో తి): స్వామిత్ర సర్వే త్వరగా పూర్తి చేయాలని రామసముద్రం మండల ఉప మండల ప్రణాళిక అభివృద్ధి అధికారి ఎస్ఏ గపూర్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. చొక్కాండ్లపల్లె సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ స్వామిత్ర సర్వే, ట్యాంకుల క్లోరినేషన్, ఇంటింటికీ చెత్త సేకరణ ఇతర పనులపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బందికి సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రతి 15రోజులకు ఒకసారి శుభ్రపరిచే కార్యక్రమాలు నిర్వహించడం, పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సహకారంతో మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శికి ఇంటి పన్నుల వసూలు, సిబ్బంది హాజరు, చెరువుల వేలం నిర్వహించి ఆ మొత్తాన్ని జమ చేయడం వంటి విషయాలపై కూడా ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఆఫీస్ సమయాల్లో ఫీల్డ్‌కి వెళ్తున్నప్పుడు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో పాటు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయడం తప్పనిసరని సూచించారు. అనంతరం చొక్కాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించి పర్యావరణ కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.భానుమూర్తి, గ్రీన్ అంబాసిడర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : డీఎస్‌డీవో

కడప స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్‌బాషా స్పష్టం చేశారు. స్థానిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఉన్న తన చాంబరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ డీఎస్ఏ మైదానంలో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేలా ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, కబడ్డీ, జిమ్, స్కేటింగ్ తదితర క్రీడల కోచ్‌లు ఉన్నారని, వాలీబాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్ క్రీడలకు ప్రస్తుతం కోచ్‌లు లేరని తెలిపారు. త్వరలో సంబంధిత క్రీడాకారుల ప్రధాన కార్యాలయం (విజయవాడ) నుంచి ఆదేశాలు రానున్నాయని, కోచ్‌లను నియమించి క్రీడల పురోగతికి బాటలు వేస్తామన్నారు.